క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ విజేత ఉరుకుంద జట్టు



విజేత జట్టుకు నగదును అందజేస్తున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని కొల్మాన్‌పేట గ్రామంలో నిర్వహించిన సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఉరుకుంద జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం ఫైనల్ పోటీల్లో ఉరుకుంద, కొల్మాన్‌పేట గ్రామ జట్లు తలపడ్డాయి. కొల్మాన్‌పేట గ్రామ జట్టుపై ఉరుకుంద జట్టు గెలుపొందింది. ఉరుకుంద జట్టుకు ప్రథమ బహుమతి రూ.30వేలను గ్రామ యువ నాయకుడు ఉప్పలపాటి అర్జున్ అందజేశారు. అదేవిధంగా ద్వితీయ బహుమతి 20 వేలను కొల్మాన్‌పేట జట్టుకు గ్రామానికి చెందిన యువ నాయకుడు వలకలదిన్నె కృష్ణ అందజేశారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం



గంగమ్మ బంధువులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని 24వ వార్డు క్రాంతినగర్‌లో నివాసముంటున్న బెస్త గంగమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. మృతురాలి బంధువులు రంగమ్మ, క్రాంతినగర్ ఇన్‌చార్జి రాజు సమాచారాన్ని ఎమ్మెల్యేకు తెలియజేశారు. గంగమ్మ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను ఎమ్మెల్యే సాయంగా అందించారు.


బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న మురళీ మోహన్‌రెడ్డి

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో బీరప్ప స్వామి ఆలయ ఆవరణలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ నిధులు రూ.21లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి ఆలయ కమిటీ పెద్దల సమక్షంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముందుగా బీరప్ప స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బీసీ సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. ఆలయ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తుండడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

రసవత్తరంగా గిరకబండి పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

మద్దికెర: మండల పరిధిలోని ఎడవలి గ్రామ పరిసరాలలో ఉన్న రామకృష్ణాపురం ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఆదివారం నిర్వహించిన దేశం, కిలారి ఎద్దులు గిరకబండి లాగే పోటీలు రసవత్తరంగా జరిగాయి. పోటీలలో 14 జతల వృషభాలు పాల్గొన్నాయి. పెంచలపాడు గ్రామానికి చెందిన వృషభాలు గిరకబండిని ఎక్కువ దూరం లాగి విజేతగా నిలిచి మొదటి బహుమతి రూ. 20 వేలు గెలుపొందాయి. రెండవ బహుమతి డొనేకల్లు గ్రామానికి చెందిన ఎద్దులు రూ.15 వేలు, వలిగొండ గ్రామానికి చెందిన ఎద్దులు మూడవ బహుమతి రూ.10 వేలు, కైరుప్పల గ్రామానికి ఎద్దులు నాల్గవ బహుమతి రూ.5 వేలు గెలుచుకున్నాయి. పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. విజేత వృషభాల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

ఆలయాభివృద్ధికి విరాళం



దాతలకు స్వామి వారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

మద్దికెర: స్థానిక సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో శిలా మండప నిర్మాణానికిగాను హైదరాబాద్‌కు చెందిన రుక్మిదేవి, త్రిపురేశ్వరరావు దంపతులు రూ. 1,00,116 విరాళాన్ని ఆలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి వారి జ్ఞాపికను అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

తల్లీబిడ్డ 'ఆరోగ్యం' పదిలం!

- మాతా,శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం
- ప్రసవాలు చేయడంలో కోసిగి పీహెచ్‌సీకి ప్రథమ స్థానం
- ఏడాదిలో 1641 ప్రసవాలు చేసిన వైనం
- వెల్లువెత్తుతున్న అభినందనలు



కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఆసుపత్రిలో విశ్రాంతి తీసుకుంటున్న బాలింతలు(ఫైల్)

కోసిగి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాతాశిశు సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యతిస్తుంది. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులతోపాటు వైద్యులు, వైద్య, ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండడంతో ఏటేటా ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెరుగుతుంది. ప్రత్యేకించి రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవం చేయడంలో కోసిగి ప్రాథమిక ఆరోగ్యం ప్రథమ స్థానంలో నిలిచింది. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 1641 కాన్పులు చేశారు. రాష్ట్రంలోని 1145 పీహెచ్‌సీల్లో కోసిగి పీహెచ్‌సీలో అత్యధిక కాన్పులు జరగడంతో మొదటి స్థానం కైవసం చేసుకుంది. దీంతో ఆరోగ్య, వైద్య సిబ్బంది సేవలపై అన్ని వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గత ఐదేళ్లుగా సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరుగుతుండడంతో ప్రథమ స్థానం నిలుస్తోంది. కాన్పు సురక్షితంగా చేస్తుండడంతో కోసిగి పీహెచ్‌సీ పరిధిలోని 26 గ్రామాలే కాక మంత్రాలయం, కౌతాళం, పెద్దకడబూరు మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి గర్భిణులు కాన్పు నిమిత్తం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారు.

ఆర్థిక సంవత్సరం కోసిగి ఆసుపత్రిలో జరిగిన కాన్పులు

2018-2019	1604
2019-2020	1455
2020-2021	1578
2021-2022	1784
2022-2023	1641

కాన్పుల్లో కోసిగి పీహెచ్‌సీ ఉత్తమం :

కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్స్ పని చేస్తున్నారు. రెగ్యూలర్‌గా నర్సింగ్ ఆఫీసర్ కాన్పుల వార్డుల్లో అందుబాటులో ఉంటారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి నెలకోసారి రక్త పరీక్షలు చేసి రక్తహీనత లోపించకుండా చర్యలు తీసుకుంటారు. గర్భిణులకు ఐరన్ టాబ్‌లెట్స్, సెలైన్ బాటిళ్లు ఎక్కించి ఆరోగ్య సలహాలు సూచనలు చేస్తుంటారు. ప్రతి మంగళ, శుక్రవారల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఐదవ నెలలో మాత్రం ఆదోనికి వెళ్లి పరీక్షలు చేయించాలని సూచిస్తారు. ఈ పరీక్షల మేరకు హైరిస్క్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సాధారణ కాన్పులకు కృషి చేస్తారు.

గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం



ఆశావర్కర్స్, స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎంల సహకారంతో నెలకోసారి గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి నెలా 9వ తేదీన ఆసుపత్రిలో రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత లోపించకుండా చైతన్య పరుస్తున్నాం. రిస్క్ గర్భిణులకు సలహాలు సూచనలు చేస్తున్నాం. దీంతో కాన్పుల సమయానికి సాధారణ స్థితికి చేరుకోవడం కాన్పులు ప్రశాంతంగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో మొదటి స్థానం రావడం సంతోషంగా ఉంది.

– డాక్టర్ మనోజ్‌కుమార్, కోసిగి

కాన్పును ప్రశాంతంగా చేశారు



మాది రచ్చుమర్రి గ్రామం. మా భార్య లక్ష్మీ మొదటి కాన్పు ప్రసవం నిమిత్తం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చాం. అక్కడ స్టాఫ్‌నర్స్ పరీక్షించి కాన్పు కావడం కష్టంగా ఉందన్నారు. మొదట్లో బయపడ్డాం. స్టాఫ్‌నర్స్ రిస్క్ తీసుకుని సాధారణ కాన్పు జరిగేలా చూశాడు. ఆడ పిల్ల పుట్టడంతో చాలా సంతోషంగా ఉంది. వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– భీమా , రచ్చుమర్రి

12 ఏళ్లుగా పనిచేస్తున్నాను



కోసిగి పీహెచ్‌సీలో ఆసుపత్రిలో దాదాపు 12 ఏళ్లుగా మేల్ స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తున్నా. ఇప్పటి వరకు 15వేల వరకు సాధారణ కాన్పులు చేశా. నెలకోకసారి పరీక్షలు నిర్వహించి రిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించి సాధారణ స్థితికి తీసుకొచ్చేలా వైద్య సేవలు అందిస్తున్నాం. దీంతో సాధారణ కాన్పులు జరిగేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రథమ స్థానంలో నిలబెట్టాం.

– రాఘవేంద్ర, మేల్ స్టాఫ్ నర్స్, కోసిగి

బాలింతలకు ప్రభుత్వ సాయం

ఆసుపత్రిలో కాన్పు జరిగిన బాలింతలకు ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.4వేలు, జననీ సురక్షిత యోజన కింద రూ.1000 నగదును అందజేస్తుంది ప్రభుత్వం. కాన్పు అయిన నాటి నుంచి ఉదయం టిఫెన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం పాలు, బెడ్లు, రాత్రి భోజన వసతి కల్పిస్తున్నారు. అలాగే కాన్పులు అయిన బాలింతలను తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా నేరుగా వారి గ్రామంలోని ఇంటి వద్దకు చేర్చుతున్నారు. దీంతో బాలింతలకు ఇబ్బందులు లేకుండా సురక్షితంగా చేర్చుతున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సేవల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

మంత్రాలయం: మంత్రాలయం మండలం మాలపల్లి సచివాలయం పరిధిలోని సొల్లహళ్లి గ్రామంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నేత ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు.

టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏఎస్పీ

ఆదోని అర్బన్ : స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం అడిషనల్ ఎస్పీ ప్రసాద్ తనిఖీ చేశారు. ముందుగా ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం సీఐ శ్రీనివాస్‌నాయక్‌తో మాట్లాడి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆదోని అర్బన్ : స్థానిక మున్సిపల్ హైస్కూల్ (1997–98 పదో తరగతి బ్యాచ్) పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సిద్ధప్ప, విజయకుమారి, ప్రసాద్, నరసయ్య, నాగన్న, రత్నమయ్యలను సన్మానించారు. శాలువాలు కప్పి, పూలమాలలు వేసి గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత మిత్రులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఈరన్న, గణేష్, దుర్గేష్, వీరేష్, గౌస్, రామంజి, ఇతర మిత్రులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



పెద్దకడబూరులో ఆంజనేయస్వామి ప్రభోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో శ్రీ రణమండల ఆంజనేయస్వామి



ప్రత్యేక అలంకరణలో కొండాపురం ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్ : పట్టణశివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఆలయ నిర్వాహకుడు పాండయ్య ఆధ్వర్యంలో వేకువ జామున స్వామివారికి ఫలపంచామృతాభిషేకం, గంధం, పసుపు, కుంకుమ, భస్మం, క్షీరాభిషేకం, తులసీ, వడలహారం, ప్రత్యేక పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు, కార్తీకమాస నిత్యప్రసాద సేవాసమితి సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

మంత్రాలయం: మండల కేంద్రం మంత్రాలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను గంగపుత్ర సంఘం అధ్యక్షులు శాంతయ్య ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా పాతవూరులోని ఆంజినేయస్వామి గుడి నుంచి కొండాపురం ఆంజినేయస్వామి ఆలయం వరకు స్వామి విగ్రహాలను పల్లకీలో ఉంచి డ్రమ్స్, డప్పుల వాయిద్యాల మధ్య బాణాసంచా పేల్చుతూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళలు కలశాలతో ఊరేగింపులతో పాల్గొన్నారు. ఆంజినేయ్యస్వామికి ఫల, పుష్ప, క్షీరా, పంచామృతాభిషేకాలు నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య స్వామివారిని దర్శించుకుని నారికేళాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగితోపాటు గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక శ్రీ మార్కండేయ స్వామి ఆలయంలో కొలువుతీరిన శ్రీ ఆంజనేయ స్వామి కి ఆలయ అర్చకులు వీరేష్ స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టారు. స్వామి వారికి జలాభిషేకం, పాలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫల, పుష్పాలంకరణలు, నూతన వస్త్రాలంకరణలు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు.

పెద్దకడబూరు : మండల కేంద్రం పెద్దకడబూరుతో పాటు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక చావిడి సమీపానున్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి పెద్దకొండ దగ్గర వెలసిన పాతూరు ఆంజనేయ స్వామి దేవాలయం వరకు స్వామివారి ప్రభోత్సవాన్ని ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీ మఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక హైకోర్టు జడ్జి హేమలేఖ ఆదివారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్, శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు జడ్జికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

శ్రీ మఠంలో డీఎస్పీలు : శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు ఆదోని డీఎస్పీగా పని చేసి పులివెందులకు బదిలీ అయిన వినోద్‌కుమార్, నూతనంగా ఆదోని డీఎస్పీగా పదవి బాధ్యతలు స్వీకరించిన శివనారయణ వేర్వేరుగా మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు పాల్గొన్నారు.

వేసవి తాపానికి ఉపశమనం



మఠానికి వెళ్లే దారుల్లో కార్పెట్స్‌పై నీటిని వదులుతున్న సిబ్బంది

మంత్రాలయం రూరల్: రోజు రోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో శ్రీ మఠం అధికారులు ఉపశమన చర్యలు చేపట్టారు. శ్రీ మఠం ప్రధాన ద్వారం నుంచి కారిడార్ మీదుగా శ్రీ మఠానికి వెళ్లేందుకు అధికారులు నూతనంగా సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. అయితే భానుడి ప్రతాపానికి భక్తులు విలవిలలాడుతున్నారు. దీంతో అధికారులు శ్రీ మఠం ప్రధాన ద్వారం నుంచి మఠం వరకు కార్పెట్స్ పరిచి వాటిపై నీటిని వదిలి భక్తులకు ఉపశమనం కలిగిస్తున్నారు. మరో వైపు ప్రసాదం, సేవ కౌంటర్‌ల వద్ద తాత్కలిక షెడ్లు ఏర్పాటు చేసి నీడ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దళారులను ఆశ్రయించొద్దు

ఆలూరు రూరల్: వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు కోసం రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఆలూరు విద్యుత్ ఏఈ లోకేష్ సూచించారు. ఆయన ఆదివారం స్థానిక సబ్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్ కావాలనుకున్న వారు నేరుగా ఏఈను సంప్రదించాలన్నారు. మండలంలో ఇప్పటివరకు వచ్చిన 20 వ్యవసాయ బోరు కనెక్షన్లకు ఎస్టిమేట్ వేసి పంపించామని తెలిపారు. ఇందుకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు సబ్ స్టేషన్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సీనియారిటీ జాబితా ప్రకారం వీటిని రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. వేసవిలో కూడా రైతులకు అంతరాయం లేకుండా పగటి పూట విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 20వ తేదీలోపు పెండింగ్ బిల్లులు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నకిలీలకు చెక్

- విత్తనాలు, ఎరువుల నాణ్యత నిర్ధారణకు ఉచితంగా పరీక్షలు
- నకిలీవని తేలితే సంబంధిత విత్తన కంపెనీలపై కేసులు
- ఫలితాలు తారుమారు కాకుండా ల్యాబ్‌లో ఆటో మిషన్ ఏర్పాటు
- ఆలూరు మార్కెట్ యార్డులో ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- సద్వినియోగం చేసుకోవాలంటున్న వ్యవసాయ అధికారులు





విత్తన పరీక్షలను పరిశీలిస్తున్న ఆలూరు ఏడీఏ సునీత, ఆలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

ఆలూరు రూరల్: విత్తనం మంచిదైతే పంట బాగా పండుతుంది. దిగుబడి దిగులుండదు. దిగుబడి, ధరలు అనుకూలిస్తే రైతులకు తిరుగుండదు. అంతా సవ్యంగా జరగాలంటే సాగుకు మేలైన రకం విత్తనాలు కావాలి. రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గానికి ఒక సమగ్ర వ్యవసాయ పరీక్షా కేంద్రం (వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్) మంజూరు చేశారు. ఇందులో భాగంగానే ఆలూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా 2021 సెప్టెంబర్ 8వ తేదీన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆరుగాలం శ్రమించే అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకూడదనే ఉద్దేశంతో పైసా ఖర్చు లేకుండా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను ముందుగానే పరీక్షించేలా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు విత్తన పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఆలూరు అగ్రిల్యాబ్‌లో గత మూడేళ్ల నుంచి ఇప్పటివరకు చేసిన విత్తన పరీక్షలు

ఏడాది	విత్తన పరీక్షలు	ఎరువుల పరీక్షలు
2021-22	42	37
2022-23	152	9
2023-24 ఇప్పటి వరకు	9	6

టెస్టింగ్ ప్రక్రియ ఇలా..

ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నాణ్యత పరీక్షలను పారదర్శకంగా చేపట్టేందుకు విశాఖపట్నం, తిరుపతి, అమరావతి, తాడేపల్లిగూడెంలలో ప్రభుత్వం నాలుగు ప్రాంతీయ కోడింగ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ లక్ష్యాల మేరకు వ్యవసాయ అధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో శాంపిల్స్ సేకరించి ప్రత్యేక యాప్ ద్వారా బ్యాచ్ నంబర్ కోడింగ్ చేసి రీజనల్ సెంటర్లకు పంపిస్తారు. ఆ శాంపిల్స్‌ను రీజనల్ సెంటర్ల నుంచి ఆయా నియోజకవర్గాల్లోని అగ్రి ల్యాబ్‌లకు పంపి పరీక్షలు చేయిస్తారు. విత్తనాల మొలక శాతం, తేమ శాతం, విత్తన నాణ్యత ప్రమాణాలు పరిణాల మాలపై పరీక్షలు నిర్వహించి నివేదికలు ఇస్తారు. నకిలీలని తేలితే సంబంధిత షాపులు, విత్తన కంపెనీలపై చర్యలకు సిఫార్సు చేస్తారు. కేసు నమోదు చేయించి కోర్టులో నిలబెడతారు. ఎరువులు, విత్తనాలు, మందులు నకిలీలని తేలితే రీ-అనాలసిస్ (తిరిగి పరీక్ష) చేసేందుకు షాపులో ఉన్న సరకు సీజ్ చేస్తారు. కేసు పెట్టి జాయింట్ కలెక్టర్ కోర్టుకు హాజరు పరుస్తారు.

అగ్రి ల్యాబ్‌లో చేసే పరీక్షలు..

విత్తన మొలక, తేమ శాతం, విత్తనం స్వచ్ఛత పరీక్ష, యూరియా, నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్, బోరాన్, సల్ఫేట్, సింగిల్ సూపర్ పాస్ఫేట్(ఎస్ఎస్‌పి), డై అమ్మోనియం ఫాస్పేట్ (డీఏపీ) కాంప్లెక్ ఎరువుల పరీక్షలు చేస్తారు.

పరీక్షలు ఉచితం..

రైతులు విత్తుకు ముందు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై అనుమానం ఉంటే అగ్రి ల్యాబ్‌కు వెళ్లి ఉచితంగా పరీక్ష చేయించుకునే వెసలుబాటు కల్పించారు. ఇందుకు వ్యవసాయ అధికారులు సహకరిస్తారు. విత్తన, ఎరువులు, పురుగు మందుల కంపెనీల ప్రైవేటు డీలర్లు పరీక్ష చేయించుకోవాలంటే మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాల్సి ఉంటుంది. సీడ్, కెమికల్ ఫర్టిలైజర్, బయో, ఆర్గనిక్ ఫర్టిలైజర్ పరీక్షల కోసం రూ.1000 నుంచి రూ.3,500 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రైతులకు సమీపంలోనే ల్యాబ్‌లు అందుబాటులోకి రావడం, అధునాతన సాంకేతికతతో పరీక్షలు నిర్వహిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అగ్రిల్యాబ్‌లకు ఇన్‌చార్జ్‌లుగా వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) ఉంటారు. ఇద్దరు ఏఓలు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షలు నిర్వహిస్తారు. ల్యాబ్‌లో నమూనా పరీక్ష కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ క్యాలిటీ కంట్రోల్ యాప్ అందుబాటులో ఉంచారు. ఫలితాలు తారుమారు కాకుండా వీల్లేని రీతిలో ల్యాబ్‌లో ఆటోమేషన్ ఏర్పాటు చేశారు. టెస్టింగ్ చేసిన ప్రతి ఒక్కటి రికార్డు కావడంతో పాటు వాటంతట అవే సిస్టంలో నమోదవుతాయి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

నాణ్యత ప్రమాణాలతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడమే వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రధాన ఉద్దేశం. నకిలీల బారి నుంచి రైతులు విముక్తి పొందేందుకు అవకాశం లభిస్తుంది. విత్తనం కొన్న రైతు అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి అగ్రి ల్యాబ్‌లో విత్తన పరీక్ష చేయించుకోవాలి. విత్తన పరీక్షలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా కోడింగ్ పద్ధతిన పరీక్ష చేస్తారు. అగ్రి ల్యాబ్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సునీత, ఏడీఏ, ఆలూరు

విధులు ఒకచోట.. నివాసం మరోచోట

గోనెగండ్ల: ప్రభుత్వ ఉద్యోగులు తాము పనిచేసే ప్రాంతంలోనే నివాసం ఉండాలనేది నిబంధన. అయితే మండలంలో పనిచేసే ఉద్యోగుల్లో 80 శాతం మంది నిబంధనలకు విరుద్ధంగా పట్టణాలు, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అవసరమైన సమయంలో సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అంతేగాక అధికారులు సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు గంటల తరబడి వారి దర్శనం కోసం నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. వైద్యం, రెవెన్యూ, మండల పరిషత్, ఐకేపీ, ఉపాధి, ట్రాన్స్‌కో, హౌసింగ్, పశుసంవర్థక, వ్యవసాయ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులే గాక కిందిస్థాయి సిబ్బంది సైతం దూరంగా పట్టణాల్లో నివసిస్తున్నారు. దీంతో కార్యాలయాల్లో జరగాల్సిన పనుల్లో తీవ్రజాప్యం జరుగుతుంది. త ద్వారా ప్రజలు అష్టకష్టాలు పడుతూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంటోంది.

ఆలస్యంగా రావడం.. ముందుగానే వెళ్లిపోవడం

అధికారులు ఉద్యోగం చేస్తున్న ప్రాంతాలకు దూరంగా ఉండడం వల్ల కార్యాలయాలకు సమయానికి రావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే సాయంత్రం మాత్రం ముందుగానే వెళ్లిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు లాంటి పట్టణాల్లో కాపురాలు ఉండటంతోనే ఈ సమస్య ఏర్పడుతోందని, స్థానికంగా కాపురాలు ఉంటే సమస్యలపై అధికారులకు అవగాహన ఉండడంతో పాటు వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టవచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యులు దూరంగానే..

మండలంలో ఎటు చూసినా మురికి కాలువలు కంపు కొడుతున్నాయి. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం కారణంగా దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. తద్వారా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. జ్వరాలు వస్తుండటంతో స్థానిక వైద్యశాలలో రోజుకు 200 మంది దాకా రోగులు వస్తుంటారు. మధ్యాహ్నం అయితే ఆస్పత్రిలో ఎవరు ఉండరు. అత్యవసర సమయంలో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిందే. స్థానికంగా డాక్టర్లు కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది.